క్లుప్తంగా

కాటన్ సంచులనే వినియోగిద్దాం



ప్రత్తిపాడు: గ్రామంలో క్లాత్ సంచులనే వినియోగిద్దామని ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ యశ్వంత్ శ్రీనివాసరావు అన్నారు. తుమ్మపాలెంలో గ్రామ పంచాయతీ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తుండటంతో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు, ఎదురయ్యే ఇబ్బందులపై గ్రామస్తులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు అంటూ ఐటీసీ ఫినిష్ సొసైటీ సహకారంతో ఇంటింటికి కాటన్ సంచులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాటన్, క్లాత్, జూటు బ్యాగులను మాత్రమే వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్ష్మీనారాయణ, డీపీఆర్‌సీ ఆర్పీ అనురాధ, ఐటీసీ ఫినిష్ సొసైటీ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా సచివాల సిబ్బంది, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం



ప్రత్తిపాడు: విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవరుచుకోవాలని ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ బి.అరుణ అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చదవడం, చెప్పించడం పోటీలతో పాటు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: విద్యుత్ సరఫరా లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పెదకాకాని ఏఈ జి.బ్రహ్మయ్య తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కొప్పురావూరు, నాగార్జున నగర్, నాగార్జున యూనివర్సిటీ, నంబూరు రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత

ప్రత్తిపాడు: యోగాతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని.. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగాంధ్రపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను మండల స్థాయిలో నిర్వహించారు. పోటీలకు ప్రత్తిపాడు, పెదగొట్టిపాడుతో పాటు పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. పోటీలను కరుణకుమార్ పరిశీలించారు. విజేతలగా గెలుపొందిన పేర్లను మండల విద్యాశాఖాధికారులు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణిలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రాభరణాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ – డైమండ్స్ షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను గురువారం డాక్టర్ పాలకుర్తి శ్రీస్నేహ, డాక్టర్ రోహిత, పెద్ది రమణారావు ప్రారంభించారు. రోజు ధరించే నగలు, పెళ్లి ఆభరణాలు, లైట్ వెయిట్ నగలు, పురుషుల ఆభరణాలను అందుబాటులో ఉంచినట్లు స్టోర్ హెడ్ నదిర్, ఎంటీ జితిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపికిరణ్ తెలిపారు. ఈ నెల ఐదు నుంచి పదో తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని అన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే బంగారం విలువలో పది శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం పొందవచ్చునని వారు పేర్కొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాలి

దుగ్గిరాల: దుగ్గిరాల హౌసింగ్ కాలనీ దగ్గర విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల స్మార్ట్ మీటరు వ్యతిరేకించాలని, విద్యుత్ బిల్లులు తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, స్టాలిన్, బ్రహ్మేశ్వర రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల వెంట పేరుకుపోతున్న వ్యర్థాలు!

- సంపద కేంద్రాలకు చేరని చెత్త
- గ్రామాల్లో రోడ్ల వెంట అధికంగా డ్రంప్ చేస్తున్న వైనం



పెదకాకాని- తక్కెళ్లపాడు మార్గంలో ఆటోనగర్ వద్ద తగలబెడుతున్న వ్యర్థాలు



గుంటూరు నుంచి పెదకాకాని వచ్చే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

పెదకాకాని: గ్రామీణ ప్రాంతాలు అనగానే పచ్చని పల్లెటూర్లు, ఆహ్లాదకరమైన వాతావరణం గుర్తుకు వస్తాయి. కానీ పెదకాకాని, నంబూరు గ్రామాలు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఈ గ్రామాలకు వెళ్లే రహదారులు చెత్తతో పేరుకుని దుర్వాసనతో దర్శనమిస్తున్నాయి. గుంటూరు నుంచి పెదకాకాని మీదుగా మంగళగిరి, విజయవాడ వైపు నిత్యం వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. పెదకాకాని గ్రామ శివారు అయిన పోలీసుస్టేషన్ దాటితే రోడ్ల పరిస్థితి దుర్వాసనతో మరీ దయనీయంగా ఉంది. రహదారుల పక్కన చెత్త, కుళ్లిన పండ్లు, తాగిన కొబ్బరి బొండాలు, ముంజలు తీసిన తాటికాయ బుర్రలు వేస్తున్నారు. దీంతో ఈ రహదారులు వ్యర్థాలతో దర్శనమిస్తూ గ్రామాలకు వచ్చే వారికి స్వాగతం పలుకుతున్నాయి. సంపద సృష్టించే కేంద్రాలకు తరలించాల్సిన చెత్త రోడ్ల పక్కన తగలపడడంతో ఆ కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

పొగతో అవస్థలు..

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని బాజీబాబా దర్గా, శివాలయం, ఏసుప్రభు తోట ప్రాంతాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్ర నలుమూలల భక్తులు పెదకాకానికి నిత్యం తరలి వస్తుంటారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో గ్రామాల్లోకి వస్తున్న ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. పెదకాకాని గ్రామం నుంచి తక్కెళ్లపాడు వెళ్లే మార్గంలో ఆటోనగర్ సమీపంలో రోడ్డు పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాలను కుప్పలు కుప్పలుగా వేస్తున్నారు. కొద్ది రోజుల తరువాత వాటికి నిప్పుపెట్టడం చేస్తున్నారు. దీంతో ఆ ప్లాస్టిక్ వ్యర్థాలు కాలుతున్న పొగతో రోజంతా వాహదారులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తక్కెళ్లపాడు శివారు నుంచి ఉప్పలపాడు వెళ్లే రోడ్డులోనూ ఇదే పరిస్థితి.

అసౌకర్యంగా వాహనదారులు..

కంతేరు అడ్డరోడ్డు నుంచి నంబూరు గ్రామంలోకి చేరుకునే రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. అదే రోడ్డులో ఒక బార్ రెస్టారెంట్‌తో పాటు వైన్స్‌షాపు ఉండటంతో తాగిన బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ఖాళీ వాటర్ బాటిళ్లు వాహనదారులకు దర్శనమిస్తున్నాయి. పక్కన ఉన్న రెడీమిక్స్ ప్లాంట్‌తో రోడ్డు దెబ్బతినడంతో పాటు రెడీమిక్స్ రోడ్డుపై పడి వాహనదారులు అసౌకర్యానికి గురౌతున్నారు. ఈ దుస్థితిపై అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను తొలగించాలని.. రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

• కసుకర్రు రహదారిలో భారీ గుంతలు



పొన్నూరు మండలంలోని కసుకర్రు గ్రామ రహదారి భారీ గుంతలతో దర్శనమిస్తోంది. ఈ రహదారిలో రాకపోకలు చేసే వారు నానా అవస్థలు పడుతున్నారు. తరచూ ఇక్కడ గుంతల వల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. రాత్రి సమయంలో సమస్య మరింత అధికంగా ఉంటోందని వాపోయారు. పెద్ద గుంతలు కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఈ రోడ్డు పొడవునా గుంతలు ఉన్నాయని.. వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- పొన్నూరు

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం

నగరంపాలెం: స్థానిక కృష్ణానగర్ ఒకటో వీధిలో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తిరుమంజన సేవ కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలో విశేషంగా అలంకరించారు. అర్చక బృందం మేళ తాళాలతో వేదికపైకి స్వామిని చేర్చారు. ప్రజా సంక్షేమం, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ కార్యక్రమం నిర్వహించారు. విశేష హారతి అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హోమం జరగ్గా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు బ్రిడ్జి నిర్మించాలి



మాట్లాడుతున్న వి.అర్లరెడ్డి

నెహ్రూనగర్: భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా శంకర్ విలాస్ బ్రిడ్జి పునర్నిర్మాణం జరగాలని పలువురు సాంకేతిక నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం బ్రాడీపేట బాలానంద కేంద్రం ఆవరణలో శంకర విలాస్ పైవంతెన సాధన సమితి ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణులతో కార్యక్రమం నిర్వహించారు. ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీనియర్ స్ట్రక్చరల్ ఇంజినీర్ వి.అర్ల రెడ్డి పేర్కొన్నారు. సుమారు 7 దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి స్థానంలో మరొక వంద సంవత్సరాల అవసరాలు తీరేలా కొత్త బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ పెద్దలు దూరదృష్టి లేకుండా మొండి పట్టుతో వ్యవహరించడం తగదన్నారు. అవగాహనా రాహిత్యంతో భవిష్యత్ తరాలకు శాపంగా మారేలా బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అండర్ పాసులు, సబ్‌వేలతో కూడిన పైవంతెన నిర్మించి ప్రజల అభిమానం పొందాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన ఫ్లై ఓవర్ సాధన సమితి కన్వీనర్ ఎల్ఎస్ భారవి మాట్లాడుతూ పాడవు కుదించిన ఆర్‌ఓబీ వల్ల లక్షల మంది ప్రజలకు కలిగే ఇబ్బందులకు ఏకైక పరిష్కారం ఆర్‌యూబీతో పాటు అండర్ పాస్ నిర్మాణం అన్నారు. అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత నిరసన ద్వారానే వీటిని సాధించాలన్నారు. ఆ పరిస్థితిని ప్రభుత్వ పెద్దలు కల్పించకూడదని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు నాయకుడు చుండూరు రంగారావు, ఆడిటర్లు పీవీ మల్లికార్జునరావు, సుబ్బారావు, నడింపల్లి గురుదత్, డీఏఆర్ సుబ్రహ్మణ్యం, కె.నళినీకాంత్, రాధాకృష్ణ, అవధానుల హరి, బెల్లంకొండ శ్రీనివాసరావు, వల్లూరి సదాశివరావు, అక్బర్, సదాశివరావు, డి ఏడుకొండలు, ఇంజినీర్ వెంకట్రావు, శివన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



జెండా ఊపి కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఢిల్లీరావు

తాడేపల్లి రూరల్: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయవాడ క్లబ్ రోడ్ నివాసితులు ఎన్ఎస్‌వీ ప్రసాద్ నన్నపనేని, రేవతి దంపతులు.. అక్షయిత, శ్రీహిత కుటుంబ సభ్యుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన నిర్వహణకు 10 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. ఆ వాహనాన్ని ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సాయం చేసే అవకాశం సామాన్యులకు కూడా కల్పించడం ఎంతో ముదావహమన్నారు. నన్నపనేని ప్రసాద్, రేవతి దంపతులు మాట్లాడుతూ.. కూరగాయలను విరాళంగా అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మరడ నాగేంద్ర మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని కీర్తిశేషులు మండవ కుటుంబరావు 2006లో ప్రారంభించారని తెలిపారు. గత 18 ఏళ్లుగా తితిదేకు కూరగాయలను వితరణగా అందిస్తున్నామన్నారు.

కార్పొరేట్ అనుకూల విధానాల కోసం సీఎం తాపత్రయం



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దోచి పెట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాపత్రయ పడుతున్నారని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు వై.నేతాజీ అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోట బాబూరావు అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాల సవరణ చేస్తూ 8 గంటల పని విధానం స్థానంలో 12 గంటలు, 15 గంటలు పనిచేయాలని మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు. మహిళలు నైట్ డ్యూటీ చేయాలని క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమని అన్నారు. జూలై నెలలో 23, 24వ తేదీల్లో గుంటూరులో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం మహా సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, వెంగమ్మ, రేణుక, బొక్క సాంబశివరావు, తాడేపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు రక్షణ పరికరాలు ధరించాలి



టాయిలెట్లను ప్రారంభించిన మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు విధుల్లో తగిన రక్షణ పరికరాలు ధరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. గురువారం నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం (నమస్తే)లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ), సెప్టిక్ ట్యాంక్‌లను శుభ్రపరిచే కార్మికులకు పని ప్రదేశాల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యూజీడీ, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ కార్మికులు నిత్యం ప్రమాదకర ప్రాంతాల్లో పనులు చేస్తూ ప్రజారోగ్యానికి రక్షణగా నిలుస్తున్నారన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయన్నారు. నమస్తే పథకం ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో యూజీడీ కార్మికులకు పీపీఈ కిట్లు అందించామని చెప్పారు. కార్మికులు విధుల్లో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రామిరెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి అనిల్, వినయ్, జీఎంసీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్స్ కూడా...

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో ఇమ్మానుయేలు పేటలో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్లను గురువారం నగర మేయర్, కమిషనరు కలిసి ప్రారంభించారు. ఐటీసీ బంగారు భవిష్యత్ వారు కమ్యూనిటీ టాయ్‌లెట్స్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు.

శ్రీలక్ష్మీ నరసింహునిగా గోపాలుడు



శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలంకరణలో శ్రీవేణుగోపాల స్వామి వారు

నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోని శ్రీజగన్నాథ స్వామి వారి దేవస్థానంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం శ్రీ వేణుగోపాల స్వామి వారికి శ్రీలక్ష్మీనరసింహ స్వామి అలంకారం నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహ హోమం, మూల మంత్ర హోమం, గ్రామ బలిహరణ చేపట్టారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో టి.సుభద్ర కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ముగిసిన సాయినాథుని బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే గల్లా మాధవి

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీషిరిడీ సాయినాథ మందిరంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. బాబా వారికి కాకడ హారతి, పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన, సహస్రనామార్చన తదితరాలను వేద పండితులు నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు మామిడి సీతారామయ్య దంపతులు సాయినాథునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం బాబా వారికి లక్ష మల్లెలార్చన భక్తి ప్రపత్తులతో చేపట్టారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి ఆలయ పాలకవర్గం పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. సాయినాథుని సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొనగా, అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, అడపా మాణిక్యాలరావు, ఆలయ గౌరవ అధ్యక్షుడు మామిడి రామారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



శ్రమదానంలో సిబార్ దంత వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు



తుమ్మలపాలెం ఎస్‌డబ్ల్యూపీసీలో మొక్కలు నాటుతున్న గ్రామస్తులు



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



శివాలయంలో మొక్కలు నాటుతున్న గోగినేని

ప్రత్తిపాడు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన ఎంపీడీవో ప్రత్తిపాడు ఘన వ్యర్థాల నిర్వహణ సెంటరులో మొక్కలు నాటారు. గ్రామాలను హరిత వనాలుగా తీర్చిదిద్దుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమె తెలిపారు. తుమ్మపాలెంలో ఎస్‌డబ్ల్యూపీసీలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. గురువారం నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోని కళాశాలలో మానవత స్వచ్ఛంద సంస్థ, కళాశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్‌రోజ్, ఆదిలక్ష్మి, కె.సుస్మిత, కె.సతీష్, నాగేశ్వరరావు, రామారావు, ఆనంద్, సాంబశివరావు, రాధాకృష్ణ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్లాస్టిక్ భూతం

పెదకాకాని: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని సిబార్ దంత వైద్య కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా సుమారు 400 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ భూతం నీరు, భూమి, ఆహారాన్ని కలుషితం చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు భాగస్వాములుగా మారాలన్నారు. తక్కెళ్లపాడు రహదారి వెంట ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తమ శ్రమదానంతో శుభ్రపరిచి, ప్రజల్లో శుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబార్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, నేషనల్ డెంటల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ బి.నాగేష్, ఇతర బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: ప్లాస్టిక్‌ను నిషేదించండి.. పర్యావరణాన్ని కాపాడండని చలపతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా సమీప గ్రామాల ప్రజలకు ప్లాస్టిక్ నిషేదంపై విద్యార్థులు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎ.బాలాజీ, జె.భార్గవ్, నాగ గోపిరాజు, డాక్టర్ ఎ.రాధాకృష్ణమూర్తి, వెంకటరామారావు, డాక్టర్ ఆర్ శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించండని చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏజీఎస్ ఐటీసీ వావ్ ఆర్గనైజేషన్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏజీఎస్ ఐటీసీ వావ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థుల తదితరులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను కాపాడుకోవాలి

పెదకాకాని: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడుకోవాలని డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఎనలేని కృషి



నగరంపాలెం: విద్యాభివృద్ధికి పలువురు ఎనలేని కృషి చేశారని ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు అన్నారు. గుంటూరు జిల్లా ఉర్దూ పాఠశాల డీఐగా విధులు నిర్వహిస్తూ యర్రగ్రౌండపాలెం ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన ఎండీ ఖాసీం, షేక్ ఖాజావలి, గేరా నాగేశ్వరరావులను గురువారం ఎస్టీయూ భవన్‌లో సత్కరించారు. వారు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.